
# తల్లిప్రేమ

— జొన్నలగడ్డ రామలక్ష్మి

ఆ ఆఫీసులో మొత్తం రెండువందల యాభై మంది ఉద్యోగులు. అంతమందినీ అదుపుచేసి వారిపై అజమాయిషీ చేసే పెద్ద ఆఫీసర్ని నేను. నేనంటే అందరికీ హడల్! ఎదురు సమాధానం చెప్పేవాళ్ళన్నా సిఫార్సులతో వచ్చేవాళ్ళన్నా మహా చిరాకు నాకు. నన్ను మెప్పించాలంటే బాగా పనిచేయాలి. ఆ విషయం అందరికీ తెలుసు. అందుకే నా ఆఫీసు క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటోంది.

ఈవిషయాలన్నీ నన్ను చూడ్డానికి వచ్చిన నా స్నేహితుడు ప్రసాద్‌కి చెప్పుకున్నాను. అతడు నా చిన్ననాటి స్నేహితుడు. ఇలాంటివి చెప్పు కుందుకు అతడు తప్ప నాకెవరూ లేరు. ఎందు కంటే అయిదేళ్ళ వయసులో నాన్న పోయాడు నాకు. అమ్మ నన్ను కష్టపడి చదివించి ఆ ఫలితం చూడకుండానే కన్నుమూసింది. అందుక్కారణం కూడా నా చదువే! అమ్మ తన జబ్బును నా చదువుకోసం నిర్లక్ష్యం చేసింది.



అమ్మ నాతో అన్తమానూ "నువ్వు చాలా గొప్ప వాడివిరా! చదువు పూర్తయాక వందలాదిమీద అజమాయిషీ చేస్తావు" అంటూండేది. ఏ రికమండేషనూ లేకుండా నాకింత ఉద్యోగం వచ్చిందంటే అది అమ్మ ఆశీర్వాదబలమే!

ఉద్యోగంలో నా హోదాగురించి నా భార్యకు చెప్పను నేను. అప్పుడు ఆడవాళ్ళు తమ హోదాను దుర్వినియోగం చేస్తారు. స్వంతంగా కారున్నా సరే ఆఫీసు కారును ఇంటిపనులకు వాడుకోవడంలోనూ, ఏ పనీలేకపోయినా తమ క్రిందివారికి ఏదో పని అంటించడంలోనూ ఆడవారికి అదో తృప్తి! అందుకే నా భార్యకి నా జీతం గురించి తప్ప నా హోదాగురించి తెలియదు. నాకింద రెండు వందల యాభైమంది ఉన్నప్పటికీ వాళ్ళలో ఏ ఒక్కణ్ణీ నేను శాసించలేననే ఆమె అను కుంటుంది.

నా స్నేహితుడు ప్రసాద్‌ముందు నా హోదా ప్రదర్శించడంలో నాకో ఆనందముంది. ప్రసాద్ చిన్నప్పుడు నాకంటె గొప్పగా ఉండేవాడు. అందు వల్ల అప్పుడప్పుడూ నన్ను కొంత చిన్నబుచ్చేవాడు కూడా! అలాంటప్పుడు మా అమ్మ అతడితో— "మావాడితో మంచిగా ఉండవోయ్ ప్రసాదూ! రేపు వాడు నీకంటే గొప్పవాడౌతాడు" అనేది. అందుకు ప్రసాదు చిన్నబుచ్చుకుంటే "డబ్బు ఈరో జుంటుంది రేపు పోతుంది. దాన్ని చూసుకుని ఎదుటివాళ్ళను చిన్నబుచ్చకూడదు. పెద్దయ్యాక మావాడు డబ్బు, హోదా సంపాదించలేకపోతే నన్నడుగు" అనేది అమ్మ.

ఇప్పుడు నేను నిజంగానే ప్రసాదుకంటె పెద్ద హోదాలో ఉన్నాను. అందుకు ప్రసాదులో రవంత అసూయ తొంగిచూస్తూంటుంది. ఆ అసూయలో నాకు మా అమ్మ తృప్తి కనబడుతుంది. ఆ అసూయను మరింతగా పెంచడానికి నా హోదాను ప్రదర్శిస్తాను.

ఆరోజు ప్రసాద్ చూస్తుండగా నాక్రింద ఉద్యోగు లందరూ నన్ను చూసి గౌరవంగా లేచి నిలబడ్డారు. వినయంగా తలలు వంచారు. నేను గదిలోకి వెళ్ళి కూర్చున్నాను. ఎయిర్‌కండిషన్డు రూము అది. ఇందులోకి నేను కొత్తగా మారాను. ప్రసాద్ ఆ గది చూసి అసూయపడి మా అమ్మ తృప్తిని పెంచాడు. అతడికోసం నేను కూల్‌డ్రింక్స్ తెప్పించాను.

ఇద్దరం కబుర్లలో పడ్డాం.

పైకి చెప్పడు కానీ ప్రసాదుకు నా హోదా గర్వకారణం. ఈ ఊరొచ్చినప్పుడు నన్ను కలుసు కోవడం, నా యింట్లో మకాం పెట్టడం, నా ఆతిథ్యాన్నందుకోవడం అతడి హోదాను పెంచుతాయి.

ప్రసాద్ తనగురించి ఏవో చెప్పుకుంటున్నాడు. నేను చిరునవ్వుతో అతడి మాటలు వింటున్నాను. నా చిరునవ్వు నా హోదాతోపాటు, అతడి మాటల పట్ల నా అనాసక్తతను కూడా స్పష్టంగా వ్యక్తం చేస్తోంది. అలాంటి చిరునవ్వు ఎవరి పెదాలమీద ఉంటే అతడు ఎదుటివారికంటె ఉన్నత స్థితిలో ఉన్నాడనీ ఎదుటివారి మాటలు వినడంలేదనీ

అర్థం!

అలాంటి సమయంలో లోపలకు చప్రాసీ వచ్చి— "సార్! మీకోసం ఒక ముసలామె వచ్చింది. అర్జంటుగా మిమ్మల్ని చూడా లంటోంది—" అన్నాడు వినయంగా.

"ఎవరో అడిగావా?"

"మీకే చెబుతానంటోంది" అన్నాడు చప్రాసీ.

"సరే లోపలకు పంపు" అన్నాను.

ఆ తర్వాత కొద్ది క్షణాల్లో తుఫాన్లా లోపలకు దూసుకువచ్చిందామె. ఆమె ఆకుపచ్చరంగు నేతచీర కట్టుకుంది. నుదుట రూపాయి కాసంత బొట్టు మెరుస్తోంది. ఆశ్చర్యంగా ఆమె కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నాయి.

"నువ్వేనా ఆఫీసరువి!" అనడిగిందామె. ఆమె గొంతులోని కఠినత్వానికాశ్చర్యపడుతూనే 'ఊఁ' అన్నాను. అంతే! ఆమె విజృంభించింది.

నా ముందున్న బల్ల, ఆ వెనుకనున్న నేను, ఆ ఎయిర్‌కండిషన్డు గది ఇవేమీ నన్ను గొప్పవాణ్ణి చేయవందామె.

"నా కొడుకు ఆరడుగులున్నాడు. తలక్రిందులుగా తపస్సు చేసినా వాడంత పొడుగు కాగలవా నువ్వు? నా కొడుకు గొంతెత్తి పాడితే వాడిముందు ఆ మహానుభావుడు ఘంటసాల కూడా బలాదూరే! అలా పాడగలవా నువ్వు? వాడిది వచ్చటి ఛాయ. అదొస్తుందా నీకు? అన్నిటినీ మించినది వాడి వినయగుణం. అది చూసే ముచ్చటపడి మా బంధువుల్లో ఒకాయన వాడికి నీకంటె పెద్ద ఉద్యోగ మిస్తానంటే, ఇదైతే మా అమ్మానాన్నల దగ్గరే ఉండొచ్చని మానేశాడు. ఆ ప్రేమాభిమానాలు నీకు చేతనౌతాయా? కాస్త అధికారముంది కదా అని ఫైలు వాడిమీద గిరవాటేస్తావా? నానా మాటలూ అంటావా? సస్పెండ్ చేస్తానని బెదిరిస్తావా? బిడ్డ మనసు పాడుచేసుకొని రోజంతా సెలవు పెట్టాడు. మా వారైతే నిన్ను ఈ ఊర్నుంచి ట్రాన్స్ఫర్ చేయించడానికి మినిష్టర్‌తో మాట్లాడతా నని చిందులేస్తుంటే అంతదాకా ఎందుకని వారించి నేనే ఇలా చక్కావచ్చాను" అందామె తీవ్రంగా.

"అమ్మా! మీరు నిలబడే ఉన్నారు, కూర్చోండి" అన్నాను నేను వినయంగా.

"ఈ నక్కవినయాలకేంలే, నా కొడుకు సంగతి చెప్పు. మళ్ళీ వాడిమీదకి ఫైలు విసురుతావా? సస్పెండ్ చేస్తానంటావా?"

"ఇప్పుడే మీరింటికి వెళ్ళి శ్యామ్‌ల్రావుని పంపండి. సెలవు కాన్సిల్ చేసుకోమనండి. నేను మీకు హామీ ఇస్తున్నాను. అతడినేమీ అనను."

"ఇప్పుడు నన్నేమీ అనలేక మళ్ళీ వాడు రాగానే విరుచుకు పడవుగదా! అల్లారుముద్దుగా పెంచాను. వాణ్ణెవరేమన్నానరే భరించలేను" అందామె కళ్ళొత్తు కుంటూ.

నేను హామీ ఇచ్చాక ఆమె వెళ్ళిపోయింది. అప్పుడు ప్రసాద్ కొత్త ఉత్సాహంతో నావంకచూసి, "ఇంకా ఏమో అనుకున్నాను. చదువురాని ఆవిడ నిన్నలా ఛీత్కరిస్తూంటే నోరెత్తలేదు నువ్వు. ఆ శ్యామ్‌ల్రావు నిజంగా నీకంటే అన్నివిధాలా గొప్ప వాడా లేక నీ కబుర్లన్నీ నాలాంటివాళ్ళ దగ్గరేనా?" అన్నాడు.

"ఆ శ్యామ్‌ల్రావుకి బొత్తిగా పనిరాదు. తప్పుచేయని రోజుండదు. ఏమయిందో నిన్న ఎదిరించి కూడా మాట్లాడితే ఫైలు విసిరేసి సస్పెండ్ చేస్తానన్నాను. దాంతో భయపడిపోయినట్టున్నాడు. కానీ ఇలా సెలవు పెడతాడనీ, తల్లి వస్తుందనీ అనుకోలేదు."

"వస్తేమాత్రం - నీలో తప్పు లేకపోతే ఆవిణ్ణి నువ్వు నానా మాటలూ అనొచ్చు. ఆవిడ కొడుకుని తీసిపారేయొచ్చు. ఇంకా చెప్పాలంటే అవతలకు పొమ్మనచ్చు."

"డియర్ ప్రసాద్! ఆ పనిచేసేవాణ్ణే. ఆమెలో అమ్మని చూడకపోతే! ప్రపంచంలో ఏ తల్లినీ ఎదుటపడి బాధపెట్టకూడదన్నది నా సిద్ధాంతం. ఆమెకు ఆమె కొడుకు గొప్ప! కాదని నేనెందుకు చెప్పాలి? అదీకాక శ్యామ్‌ల్రావు ఒకవిధంగా నాకంటే గొప్పవాడే! అతడికి తల్లి ఉంది. నాకు లేదు" అన్నాను.

అప్పుడు ప్రసాద్ ముఖం వెలిగింది. అతడికీ తల్లి ఉందన్న విషయం నాకప్పుడే గుర్తుకొచ్చింది.

## ఉద్యోగంచేసే తల్లులకు ఓ కొత్త శీర్షిక

# నేను - నా పిల్లలు

ఇంటిపని చూసుకుని, ఆఫీసు పనితో అలసిసొలసి ఇంటికి వచ్చే గృహిణులకు తిరిగి వంటింటి పనే భారంగా వుంటుంది. అటువంటిది పిల్లలు హోంవర్క్ చేయకుండా, క్రమశిక్షణ తప్పి సంచరిస్తుంటే - వాళ్ళకి నయాన్నో భయాన్నో నచ్చజెప్పి దార్లోకి తెచ్చే బాధ్యత తల్లులకి మరెంత శ్రమతో కూడినదో ఎవరైనా సులభంగా ఊహించవచ్చును. ఒక్కోసారి పిల్లల ప్రవర్తన యిలాంటి విషయాల్లో నవ్వు పుట్టించేదిగానూ వుంటుంది. అలాగే ఓరిమితో వ్యవహరించే తల్లుల వైఖరి యితరులకు మార్గదర్శకంగానూ వుంటుంది. ఆ ఆలోచనే ఈ శీర్షిక ప్రారంభించ డానికి కారణం. అయితే ఈ శీర్షికకు పునాది - ఓ పాఠకురాలు 'వనిత'కు పంపిన చిన్న అంశం. ఆమెకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆ పాఠకురాలి అనుభవాన్ని యిక్కడ ప్రచురిస్తున్నాము.

### ఆకలి బో(బా)ధ!

రోజూ సాయంత్రం ఆఫీసులో పనితో అలసి పోయి ఇంటికొచ్చే నాకు — పిల్లలు హోంవర్క్ చేయకుండా అల్లరిచేస్తూ ఉండటం ఒక తలనొప్పిగా పరిణమించింది. ఆరోజు మరీ బాగా అలసి పోయాను. పిల్లలు ఆరోజు హోంవర్క్ చేయలే దని తెలిసింది నాకు. వాళ్ళతో అరిచే ఓపిక నాలో మిగల్లేదు. ఓ కప్పు కాఫీ కలుపుకుని, టేబిల్‌మీద పెట్టుకున్నాను. కాళ్ళు టేబుల్‌మీదకి చాపుకుని, కుర్చీలో హాయిగా కూర్చుని, రిలాక్స్ అవుతున్నాను. చిన్నమ్మాయి వచ్చి అడిగింది, "ఏమ్మా... ఇంకా వంట మొదలు పెట్టలేదేం... మాకందరికీ ఆకలేస్తూ ఉంది చాలాసేపటి నుంచి...."

నేను చిన్నగా నవ్వాను.

"నా పని గురించి మీరు నాకు జ్ఞాపకం చేయవలసిన అవసరం లేదు... మీరు మీ హోంవర్క్ చేయలేదు. మీ పని మీరు చేయ కుండా, నా పని గురించి హెచ్చరించే హక్కు మీకెక్కడి నుంచొచ్చిందమ్మా?... ఎవరి పనులు వాళ్ళు సక్రమంగా చేసింతర్వాతనే — మరొకరి పనుల గురించి అడిగే హక్కు పొందగలుగుతారు. తెలిసిందా?" అన్నాన్నేను చాలా శాంతంగా, మృదువుగా.

ఆశ్చర్యం... ఈ మాటలు విన్నారు పిల్లలు. చకచకా హోంవర్క్ చేసేశారు. అరిచి, గీపెట్టి హంగామా చేయకుండానే ఆరోజు పిల్లలు 'హోంవర్క్' చేయటం నేను మర్చిపోలేని సంఘ టన...

'హేట్సాఫ్... హంగర్ టీచర్!....' అనుకున్నాను నేను.

— ఎస్.ఎల్. దేవి

ఉద్యోగినులైన తల్లులను 'వనిత' పాఠకులతో తమ జీవితంలో ఏర్పడ్డ యిలాంటి అనుభవాల్ని పంచుకోవలసిందిగా అహ్వానిస్తున్నాము. ఈ శీర్షికకి వ్యాసాలు 'నేను - నా పిల్లలు' శీర్షిక పేరిట 'వనిత' చిరునామాకు ఒక ఇన్లాండు కవరులో రాసి పంపాలి. అయితే ఇంటి చిరునామాతోపాటు, తమ ఆఫీసు చిరునామా కూడా విధిగా రాయాలి. ఈ శీర్షికకు రచనలు పంపవలసిన చివరి తేదీ: జనవరి 30. '90. ఆ తరువాత వచ్చిన రచనలు ప్రచురణకు పరిగణించ బడవు. ప్రచురణకు అర్హమని భావించిన వ్యాసాలు ఫిబ్రవరి 90 సంచికనుంచి వరసగా ప్రచురింప బడతాయి.